بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 01.07.2016 (Telugu)

**ఎటువంటి రోజులు, శుక్రవారాలను మనము రమజాన్‌లో గడిపినామో, ఏ శుభములను మనము రమజాన్‌లో పొందినామో వాటిపై స్థిరముగా యుంటూ తమ సర్వ శక్తులు, సామర్థ్యములతో తదుపరి రమజాన్‌కు స్వాగతం పలుకుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించాలని మనము దుఆ చేయుదుము.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 01.07.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఈ క్రింది సూక్తిని పఠించిరి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا نُودِيَ لِلصَّلَاةِ مِن يَوْمِ الْجُمُعَةِ فَاسْعَوْا إِلَىٰ ذِكْرِ اللَّهِ وَذَرُوا الْبَيْعَ ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ إِن كُنتُمْ تَعْلَمُونَ (10) فَإِذَا قُضِيَتِ الصَّلَاةُ فَانتَشِرُوا فِي الْأَرْضِ وَابْتَغُوا مِن فَضْلِ اللَّهِ وَاذْكُرُوا اللَّهَ كَثِيرًا لَّعَلَّكُمْ تُفْلِحُونَ (11) وَإِذَا رَأَوْا تِجَارَةً أَوْ لَهْوًا انفَضُّوا إِلَيْهَا وَتَرَكُوكَ قَائِمًا قُلْ مَا عِندَ اللَّهِ خَيْرٌ مِّنَ اللَّهْوِ وَمِنَ التِّجَارَةِ وَاللَّهُ خَيْرُ الرَّازِقِينَ (12)

అల్లాహ్ తఆలా రమజాన్ ఉపవాసములు విధిగావించబడినవని ఆదేశించినప్పుడు వెంటనే أَيَّامًا مَّعْدُودَاتٍ అనగా గణించదగ్గ అతి కొద్ది దినములని అనెను. రమజాన్ ప్రారంభమైనప్పుడు మనలోని చాలా మంది వేసవిలోని సుదీర్ఘ రోజులు, ఈ స్థితిలో 30 రోజులు ఎలా గడుచునో, చాలా కష్టమగునని ఆలోచించియుందురు. కాని గణించదగ్గ అతి కొద్ది రోజులని అల్లాహ్ తఆలా చెప్పినట్లు ఈ రోజులు గడిచిపోయినవి. నేడు రమజాన్ చివరి శుక్రవారము. ఇక 5 లేదా కొన్ని ప్రాంతాలలో బహుశా 4 ఉపవాసములు మిగిలియుండవచ్చును. రమజాన్ నుండి ప్రయోజనము పొందుటలో ఎటువంటి లోటు పాట్లు జరిగినను వాటిని దూరము చేయుటకు మనలోని ప్రతి ఒక్కరు ఈ 4,5 రోజులలో కూడ ప్రయత్నించవలెను. మమ్ము క్షమించాలని, మమ్ము కరుణించాలని, మమ్ము రమజాన్ శుభములతో దూరముంచకూడదని అల్లాహ్ తఆలాతో దుఆ చేయుము. నేను చెప్పినట్లు నేడు రమజాన్ చివరి జుమా. వాడుకలో దీనిని (జుమతుల్ విదా) వీడ్కోలు శుక్రవారమందురు. సాధారణ ముస్లిములు ఈ జుమాను రమజాన్ చివరి జుమా అని భావింతురు. ఈ జుమాలో దుఆలన్నియు ఆమోదించబడును, ఈ జుమా చదవడంతో సంవత్సరం పొడుగునా విడిచిపెట్టిన నమాజులు, జుమాలు, అన్ని రకాల ప్రార్థనల హక్కు చెల్లించబడినట్లు అగునని భావింతురు. కాని ఒక స్వచ్ఛమైన విశ్వాసి భావన కాదిది. ఇదొక తప్పుడు భావన. ఒక నిజమైన అహ్మదీ, స్వచ్ఛమైన విశ్వాసి దృష్టిలో ధర్మముతో అపహాస్యము చేసినట్లగును. ఒక సారి ఒక సమావేశములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ఇట్లు ప్రశ్న వేయబడెను. ముస్లిములలో సాధారణముగా గల ఆచారమేమనగా జుమతుల్ విదా రోజున నాలుగు రకాతులు నమాజ్ చదివి, ఖజాయె ఉమ్రి (జీవితాంతం విడిచిపెట్టిన వాటిని పూర్తి చేయుట) అని దీనికి నామకరణం చేయుదురు. గతములో వీడిన నమాజుల బదులు తీర్చాలని దీని ఉద్దేశము. దీనికేదైనా ఆధారమున్నదా లేక దీని వాస్తవికత ఏమిటి ? ఇది సక్రమమేనా? హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఇదొక అర్థరహిత విషయము. ఖజాయె ఉమ్రి రోజున చదువుతానని ఉద్దేశపూర్వకముగా నమాజులను వీడిన వ్యక్తి పాపాత్ముడు. పశ్చత్తాపపడి భవిష్యత్తులో నమాజ్‌ను వీడననే సంకల్పముతో చదివే వ్యక్తికి అభ్యంతరం లేదు. ఈ

విషయములో మేము హజ్రత్ అలీ (రజి) సమాధానమిత్తుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రస్తావించిన హజ్రత్ అలి రజియల్లాహు అన్‌హు సమాధాన సంఘటన ఇట్లు గలదు. ఒక సారి ఒక వ్యక్తి నిషేధిత సమయములో నమాజ్ చదువుచుండెను. నమాజ్ సమయము కాకున్నను నమాజ్ చదువుచుండెను. మరొకరు మీరు వర్తమాన ఖలీఫా అయినందున నిషేధిత సమయములో నమాజ్ చదువుచున్న ఈ వ్యక్తిని ఎందుకు నివారించరని హజ్రత్ అలి రజియల్లాహు అన్‌హుతో అనెను. వారిట్లు సమాధానమిచ్చిరి. నేనీ సూక్తి ప్రకారము నేరస్తుడను కాకూడదని భయపడతాను. (అల్ అలఖ్:10,11) అనగా ఒక గొప్ప దాసున్ని అతను ప్రార్థన నమాజ్ సలుపునప్పుడు ఆపు వానిని గురించి నీవు ఆలోచించితివా ?. ఈ విషయమును తెలిపిన తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పశ్చత్తాపముతో చదవని నమాజులను సలుపుచున్నచో చదవనివ్వండి. ఎందుకు ఆపుతారు. అతడు తుదకు దుఆయే చేయును కదా. కాని ఇందులో అధైర్యము గలదు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది అధైర్యమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టము చేసిరి. ఖజాయె ఉమ్రి ఉద్ధేశముతో కాక పశ్చత్తాపముతో సలిపినచో అనగా నేడు నాలుగు రకాతులు సలుపుచున్నాను, నేటి తరువాత నేను క్రమం తప్పకుండా నమాజులను సలుపుతాననే ఉద్ధేశముతో సలిపినచో అభ్యంతరము లేదు. సంస్కరణ ఉద్ధేశము లేనిచో ఇటువంటి వ్యక్తి పాపాత్ముడగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. విశ్వాసి అల్లాహ్ తఆలా సూచించిన సత్కార్యములను కొనసాగించును. అతను అల్లాహ్ తఆలా కృతజ్ఞత భావాలతో నిండియుండును. అతను అల్లాహ్ తఆలా ప్రీతని పొందుటకు రమజాన్‌ను గడుపును. అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు రమజాన్‌కు వీడ్కోలు పలుకును. కాని ఎంతో దుఃఖముతో ఇట్లనును. మేము రమజాన్‌కు వీడ్కోలు పలుకుచున్నాము కాని ఈ రోజుల జ్ఞాపకాలను మేము సదా గుర్తుంచుకొందుము.
أَرَأَيْتَ الَّذِي يَنْهَىٰ عَبْدًا إِذَا صَلَّىٰ
రమజాన్‌లో మేము నేర్చిన మంచి, సత్యోపదేశములను స్మరించుకొందుము. రమజాన్‌లో ప్రార్థన వైపు కలిగిన శ్రద్ధను సదా సజీవముగా యుంచుకొందుము. నీ సామీప్యము పొందుటకు మా పాదములు ఎన్నడు ఆగవు. మేము నీ ప్రేమపూర్వక విచిత్ర దృశ్యములను తిలకించితిమి. మేము నడిచి నీ వద్దకు వచ్చుటకు ప్రయత్నించినప్పుడు నీవు నీ వాగ్దానము ప్రకారము పరుగెత్తుకుంటూ మా వద్దకు వచ్చెదవు. మేము మా ప్రపాంచిక బంధుత్వములను మాత్రమే గుర్తుంచుకొని అందరి కంటే ఎక్కువ ప్రేమించువానిని ఎలా మరచిపోగలము, ఎలా అతని ఉపకారములను మరచిపోగలము. అల్లాహ్ తఆలా ఉపకారముల తీరులు కూడ విచిత్రమైనవి. జుమాతుల్ విదా రోజున లభించవలసిన లేదా లభించు శుభములను పొందుటకు ప్రతి ఏడవ రోజు జుమా విధించెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. జుమా రోజున ఒక ఘడియ వచ్చును. అందులో ఒక విశ్వాసి నమాజ్ సలుపుచు దుఆ చేసినచో అది ఆమోదించబడును. కాని అది అది కొద్దిగా యుండును. నేటి తరువాత మనము అల్లాహ్ తఆలా ఈ ప్రీతి ఘడియలతో దూరము కావడం లేదు. ఈ ఘడియ మనకు ఏడు రోజుల తరువాత మరల లభించనుంది. ఈ సత్కర్మలను, ఈ ఘడియలకు ఎవరైనా వీడ్కోలు పలికినచో వారు విశ్వాసులు కారు. ఇట్లనిరి. అల్లాహ్ తఆలాతో త్వర త్వరగా భేటి అగు అతని ప్రీతిని పొందు పద్ధతులను తెలుపుచు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఐదు నమాజులు, జుమా వచ్చే జుమా వరకు, రమజాన్ వచ్చే రమజాన్ వరకు వీటి మధ్య జరిగిన తప్పిదములను క్షమింపజేయుటకు పనికొచ్చును. కాని మానవుడు పెద్ద పెద్ద పాపముల నుండి దూరముండవలెననే నిబంధన గలదు.

నేను పఠించిన ఈ సూక్తులలో కూడ అల్లాహ్ తఆలా జుమా ప్రాధాన్యత గురించి తెలిపెను. ప్రత్యేకంగా జుమాలలో పాల్గొనాలని సూచించెను. జుమా అజాన్ వినగానే తమ పనులు, వ్యాపారములన్నిటిని పక్కకు పెట్టి

జుమా కొరకు రాగలరు. ఖుత్బా జుమా కూడ నమాజ్‌లోని అంతర్భాగమే. కనుక నమాజ్ ప్రారంభమయ్యే వరకు చేరుకుంటాము, నమాజ్‌లో చేరుతామని అలసత్వము ప్రదర్శించకుము. ఖుత్బా వరకు (ఖుత్బా మొదలు కాక ముందే) చేరుటకు ప్రయత్నించుము. నేనిక్కడ సందర్భానుసారము చెప్పదలచినాను. వాస్తవానికి ఇది చాలా ముఖ్యమైన విషయము. అల్లాహ్ తఆలా మన కొరకు ఎమ్.టి.ఏ. సౌకర్యమును సమకూర్చెను. యూరప్‌లో, ఆఫ్రీకాలోని కొన్ని దేశములలోనైతే జుమా సమయం కూడ ఒకే విధముగా యున్నది. ఒకే సమయమైనందున వర్తమాన ఖలీఫా ఖుత్బా వినవలెను. సమయ భేదమున్న చోట కూడ అహ్మదీయులు వినవలెను. ప్రత్యక్ష ప్రసారం కానిచో రికార్డింగ్ అయినా వినవలెను. ఇదే విధముగా ఖుత్బాలోని వివరణాత్మక పంక్తులను తీసుకొని ఖుత్బా ఇచ్చేవారు లేదా ముబల్లిఘీన్లు, మరబ్బీలు ఖుత్బాలు ఇచ్చే చోట తమ జమాఅత్‌లలో అదే రోజు లేదా తెల్లారి లేదా తెల్లారి సాధ్యము కానిచో వచ్చే వారము అదే ఖుత్బాను వినిపించవలెను. జమాఅత్‌లో ఐక్యత ఏర్పరచుటకు ఇదొక ఉత్తమ మార్గము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలముతో జుమాకు ఒక ప్రత్యేక అనుబంధము గలదు. ఈ ఆవిష్కరణ ద్వారా వర్తమాన ఖలీఫా ఖుత్బాను కూడ దీనిలోని ఒక భాగముగా అల్లాహ్ తఆలా చేసెను. అల్లాహ్ తఆలా మరల ఇట్లనెను. మీ వ్యాపారములు, ప్రాపంచిక కార్యములు ఆట, పాటలు జుమా సలుపుటలో మీకు ఆటంకిగా మారకూడదు. ప్రత్యేకంగా ఈ కాలములో వ్యాపారములు అంతర్జాతీయ స్థాయికెదిగినందున మిమ్ములను అధికంగా నిమగ్నము చేయును. ఇందులో మీరు లేదా ఒక విశ్వాసి ఎట్టి పరిస్థితిలోను జుమా ప్రాధాన్యతను దృష్టియందుంచుకోవలెను. ఎందుకనగా అల్లాహ్ తఆలా ప్రీతి పొందుటయే ఒక విశ్వాసికి ముఖ్యము. ఒక విశ్వాసి దీనికే ప్రాధాన్యత ఇవ్వవలెను.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు వారి పవిత్ర శక్తి వలన పూర్తిగా పవిత్రులైరి. అల్లాహ్ తఆలా ప్రీతి వారికి అన్నిటి కంటే ముఖ్యమైయుండెను. కనుక వ్యాపారము లేదా ఆట పాటల వలన వారు జుమాను విడిచిపెట్టేవారని వారి గురించి ఊహించను కూడ ఊహించలేము. ఇది నిశ్చయముగా మన కాలపు పరిస్థితియే. మసీహ్ మౌవూద్ కాలపు చిత్రమే. అప్పుడు ధర్మ ప్రాధాన్యత తగ్గి ప్రాపంచిక ప్రాధాన్యతలు అధికమగును. 24 గంటలు కూడ వ్యాపారములు, ఆట పాటలలో నిమగ్నమగుదురు. ప్రపంచ దూరములు తగ్గిపోవును. మీడియా ద్వారా ప్రపంచములోని వివిధ ప్రాంతాల ఆట పాటలను ఆనందము కలిగించే విషయాలను స్వగృహములోనే కూర్చొని అనుక్షణం చూసే అవకాశము లభించుచున్నది. ఇటువంటి సమయములో మీరు మీ ప్రాధాన్యాలను సన్మార్గములో యుంచుకొన్నచో మీరు అల్లాహ్ తఆలా ప్రీతిని పొందువారగుదురు. మరొక సందర్భమున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. జుమా నమాజ్ సలుపుటకు రాగలరు, వచ్చి ఇమామ్ సమీపములో కూర్చోగలరు. వాస్తవానికి స్వర్గీయులలో యున్నను ఒక వ్యక్తి జుమాలో వెనుక యుండి యుండి స్వర్గము నుండి వెనుక యుండును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జుమా ప్రాముఖ్యత గురించి తెలిపిరి. ఇదే ప్రాముఖ్యత వలన వారు తమ కాలములో 1895-96 సం॥లో జుమా నమాజ్ సలుపుటకు భారత దేశ ప్రభుత్వ కార్యాలయములలో రెండు గంటల సెలవు ఇవ్వాలని ప్రభుత్వానికి పిలుపునివ్వదలచిరి. ఇందుకు ముస్లిములతో సంతకాలు సేకరించడం మొదలు పెట్టిరి. కాని అప్పుడు ఈ కార్యము మంచిదే కాని మిర్జా గారి చేతుల మీదుగా ఇది జరగకూడదు, మనము స్వయముగా దీనిని చేపడదమాని ముహమ్మద్ హుసేన్ బటాల్వీ కరపత్రము విడుదల చేసెను. మాకెలాంటి పేరు ప్రఖ్యాతలు అవసరం లేదు. కనుక మీరే ఈ పనిని చేపట్టగలరని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెలిపిరి. కనుక వారు ఆ చర్యను నిలిపి వేసిరి. కాని అనంతరం ఆ చర్య ముందుకు సాగలేదు. ఏది ఏమైనప్పటికి ఒక సందర్భమున భారతదేశ వైస్రాయె (Viceroy of India) కు ఒక జ్ఞాపకార్థము పంపుచు అందులో వారి విశిష్టతలను ప్రస్తావించి ముస్లిముల హక్కులు చెల్లించినందుకు కృతజ్ఞతలు

తెలిపిరి. ఆ జ్ఞాపకార్థములో మరో విషయమునిట్లు వ్రాసిరి. ముస్లిముల మరో కోరిక మిగిలి యున్నది. ఇన్ని కోరికలు పూర్తి అయిన అనగా మస్జిదులు లభించినవి. ఇవి కూడ పూర్తి అగునని వారు ఆశించుచున్నారు. ఆ కోరిక ఏమనగా శుక్రవారము ఇస్లాం గొప్ప పండుగ. పవిత్ర ఖుర్ఆన్ ప్రత్యేకముగా దీనిని సెలవు దినముగా నిర్ణయించెను. భారత దేశములో మూడు జాతులు గలవు. హిందూ, క్రైస్తవులు, ముస్లిములు. హిందువులకు, క్రైస్తవులకు వారి ధార్మిక ఆచారములను జరుపుకొనుటకు ఒక దినమును కేటాయించిరి. అనగా ఆదివారము. ఆ రోజు వారు తమ మతాచారములను జరుపుకొందురు. ఇది సాధారణ సెలవు దినము. కాని ఈ మూడవ జాతి అనగా ముస్లిములు తమ పండుగ దినము అనగా జుమాను పొందలేదు. అనంతరం వారు ముస్లిములపై ప్రభుత్వము చేసిన ఉపకారముల పట్టిక వ్రాసి మరో ఉపకారము అనగా జుమా రోజున సాధారణ సెలవు ప్రకటించినచో ఈ ఉపకారము స్వర్ణాక్షరాలతో వ్రాయదగినదని కూడ వ్రాసిరి.

నేడు ముస్లిములు లేదా ఈ నామమాత్రపు ఉలమాలు అంగ్లేయులు నాటిన మొక్క అని హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విమర్శింతురు. కాని ముస్లిముల హక్కుల వైపు ఆంగ్ల ప్రభుత్వమునకు దృష్టి కలిగించిన వారు హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మాత్రమే. మరెవరికి ఈ అనుగ్రహము లభించలేదు. ఇది వారి కార్యమే అయి యుండెను. ఎందుకనగా ఈ కాలములో ఇస్లాం ప్రాముఖ్యతను ప్రపంచముపై స్పష్టపరచి, దాని స్వచ్ఛమైన బోధనను పాటింపజేయవలసి యుండెను. ఇది వారి ద్వారనే సంభవించవలసి యుండెను. వారికే ఈ కార్యము అప్పగించబడెను. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను నమ్మేవారని ప్రకటించు మన ప్రతి కర్మ, మాటతో ఇస్లాం బోధన వాస్తవము వెలువడవలెను. మనమిట్లు ప్రతిజ్ఞ చేయవలెను. ఈ రమజాన్ ఏ శుభమలను తీసుకొని వచ్చెనో, ఏ శుభములను విడిచి పోవుచున్నదో వాటిని మనము జీవిత భాగముగా చేసుకోవలెను. ఇన్షాఅల్లాహ్. మనము ఒక్క నెల కొరకు కాక శాశ్వతముగా ఇస్లాం ఆచరణాత్మక రూపము కావలెను. ఈ కాలపు ఇమామ్‌తో చేసిన ప్రతిజ్ఞను పూర్తి చేయవలెను.

మనము మన బైఅత్ ప్రతిజ్ఞనను పూర్తి చేయువారమగుదామని మనము నేడు ప్రతిజ్ఞ చేయవలెను. అల్లాహ్ తఆలా ఆదేశించిన, హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వ్యక్తపరచిన విధముగా, ఒక విశ్వాసితో ఆశించిన విధముగా అల్లాహ్ తఆలా, అతని ప్రాణుల హక్కులు చెల్లించుటకు ప్రయత్నింతుము. రమజాన్ శుభములను మనము జీవిత భాగముగా చేసుకోవలెను. ఇన్షాఅల్లాహ్. అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! ఆమీన్.

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................